క్లుప్తంగా

భైరవాష్టవమి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో కాలభైరవుడు

కొలిమిగుండ్ల: స్థానిక కొండపై వెలసిన కాలభైరవుడి ఆలయంలో సోమవారం భైరవాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పేరం సూర్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు ఆలూరి రాఘవేంద్రప్రసాద్, మహేష్ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులు కొండపై చేరుకుని స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

పేద విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన ఇద్దరు పేద విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు కోవెలకుంట్లకు చెందిన విక్కీ పౌండేషన్ అధినేత గోపిరెడ్డి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సుప్రియ, గాయత్రీ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్న రాంచరణ్‌కు పౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఫీజు చెల్లించారు. ఇద్దరు విద్యార్థులకు ప్రతి ఏటా రూ. 25 వేలు భరిస్తున్నట్లు వెల్లడించారు. స్కూల్ కరస్పాండెంట్ కృష్ణప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

డోన్ టౌన్/డోన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని డోన్ డివిజన్ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. సోమవారం డోన్ కోట్లవారిపల్లెలోని సున్నం బట్టీల్లో పనిచేసే కార్మికులకు నంద్యాలకు చెందిన జీవనజ్యోతి ఆర్థిక సహాయంతో చీరలను అందజేశారు. జేఏసీ అధ్యక్షుడు ఆదాం, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే కొండపేటలో వృద్ధులకు కడప పట్టణానికి చెందిన దైవాదీనం, ప్రేమకుమారి ఆర్థిక సహాయంతో చీరలు పంపిణీ చేశారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ


కంప్యూటర్‌ను అందజేసిన దాత నాగిరెడ్డి

బనగానపల్లె: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు వెంకటాపురం గ్రామానికి చెందిన చెన్నారెడ్డిగారి నాగిరెడ్డి సుమారు రూ.50 వేల విలువ చేసే కంప్యూటర్‌తో పాటు టెబుల్‌ను వితరణంగా ఇచ్చారు. సోమవారం స్కూల్ హెచ్‌ఎం బాలగంగధర్‌రెడ్డికి అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే పరికరాలను దాతలు సమకూర్చడం అభినందనీయమని హెచ్‌ఎం అన్నారు. దాతను సన్మానించారు.

కొచ్చెర్వు దేవరకు ఏర్పాట్లు పూర్తి

డోన్: మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో ఈనెల 24, 25వ తేదీల్లో జరగనున్న పెద్ద దేవరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. రెండు రోజుల పాటు దేవరను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పంటలు బాగా పండి గ్రామస్తులు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థిస్తూ దేవర జరుపుతున్నట్లు తెలిపారు. బంధుమిత్రులతో కొచ్చెర్వు గ్రామంలో సందడి వాతావరణ నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రాకేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనారోగ్యంతో వీఆర్వో మృతి


విష్ణువర్ధన్‌రెడ్డి (ఫైల్)

డోన్ టౌన్: కృష్ణగిరి మండలం ఎరుకలచెర్వు గ్రామ వీఆర్వో గద్దం విష్ణువర్ధన్‌రెడ్డి (45) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన స్వస్థలం డోన్ మండలం గుమ్మకొండ. గతంలో వెంకటాపురం, గుమ్మకొండలో పనిచేశారు. ఈయన మృతిపై డోన్ రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు సంతాపం తెలిపారు. కుటంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. కాగా మృతునికి భార్య నిర్మలమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్

బేతంచెర్ల: గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ముమ్మరం చేయాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ సూచించారు. సోమవారం ఏపీఓ శేషన్న, ఆయా గ్రామాల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్స్‌తో ఉపాధి హామీ లక్ష్యాలపై సమావేశం నిర్వహించారు. సకాలంలో పనులు పూర్తి చేస్తే మెటీరియల్ ద్వారా వచ్చే నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. సరైన కొలతలతో కూలీలు పనులు చేసేలా చూడాలన్నారు.

లెక్క.. పక్కాగా!

- చురుగ్గా పశుగణన సర్వే
- నియోజకవర్గంలో ఇప్పటికే 80 శాతం పూర్తి
- సర్వేలో 18 మంది ఎన్యూమరేటర్లు, ఆరుగురు సూపర్‌వైజర్లు


అవుకులో పశుగణనను పరిశీలిస్తున్న ఏడీఏ

బనగానపల్లె పశుసంవర్ధకశాఖ పరిధిలో

జంతువుల వివరాలు (అంచనా)

ఆవులు	9802
గొర్రెలు	107193
మేకలు	46987
కోళ్లు	92681

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పశుసంవర్ధకశాఖ పరిధిలోని బనగానపల్లె, అవుకు మండలాలతో పాటు నియోజవర్గంలోని కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, సంజామల మండలాల్లో పశుగణన కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. అవుకు, బనగానపల్లె మండలాల్లోని 23,828 కుటుంబాల వద్ద ఉన్న గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, పందులు, కుక్కలు, కోళ్ల తదితర జంతువులపై ఎన్యూమరేటర్లు ఇంటింటికీ సర్వే చేస్తున్నారు. మొత్తం 18 రకాల జంతువుల వివరాలు సేకరిస్తున్నారు. ఇందు కోసం బనగానపల్లె పశుసంవర్ధకశాఖ పరిధిలో మొత్తం 18 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. ఒక్కో ఎన్యూమరేటర్ 1,323 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంటుంది. ఏఏ జంతువులు ఉన్నాయో నమోదు చేయాలి. ఎన్యూమరేటర్లను పర్యవేక్షించడానికి ఆరుగురు పశువైద్య సిబ్బంది సూపర్‌వైజర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. 2011 లెక్కల ప్రకారం సర్వే జరుగుతున్నప్పటికీ కొత్తగా వచ్చిన ఇళ్లలో ఉన్న జంతువులనూ లెక్కిస్తున్నారు. బనగానపల్లె అసిస్టెంట్ డైరెక్టర్ పరిధిలో ఇప్పటికే ఆవులు 9,802, గేదెలు 41,240, గొర్రెలు 1,07,193, మేకలు 46,987, కోళ్లు 92,681 ఉన్నట్లు అంచనా వేశారు. ఈ ఏడాది నవంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమైన పశుగణన 2025 ఫిబ్రవరి వరకు కొనసాగుతుంది. సర్వేను ప్రతి రోజు 30 ఇళ్ల వరకు చేయాలి. ఒక్కో ఎన్యూమరేటర్ పరిధిలో గ్రామాల్లో అయితే 1200 నుంచి 1500 గృహాలు, పట్టణాల్లో అయితే 2వేల నుంచి 3 వేల ఇళ్ల వరకు సర్వే చేయాల్సి ఉంటుంది. జంతువులతో పాటు వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ యంత్రాలను లెక్కించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. గ్రామస్థాయిలో విధులు నిర్వహించే పశువైద్య సిబ్బంది రోజువారి పశువులకు వైద్య సేలందిస్తూనే మిగిలిన సమయంలో సర్వే చేస్తున్నారు. సర్వే పూర్తి చేసిన ఇళ్లకు స్టిక్కర్లను అంటిస్తున్నారు. అలాగే పశుగణన వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు పొందుపరుస్తున్నారు. బనగానపల్లె పశుసంవర్ధకశాఖ పరిధిలో ఇప్పటి వరకు సుమారు 80 శాతం సర్వే పూర్తయిన్నట్లు ఏడీఏ మారుతిసకరామ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో దేశ వ్యాప్తంగా కొనసాగుతున్న ఈ పశుగణన వల్ల పశు పోషణకు,రైతులకు మేలు జరుగుతుందన్నారు.


గొర్రెలు, మేకలు లెక్కిస్తున్న పశువైద్య సిబ్బంది

సర్వేతో అన్ని విధాలుగా ఉపయోగం



జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన ఎన్యూమరేటర్లు, పశువైద్య సిబ్బంది పశుగణన సర్వేలో పాల్గొంటున్నారు. బనగానపల్లె ఏడీఏ పరిధిలో మొత్తం 18 మంది ఎన్యూమరేటర్లు, ఆరుగురు సూపర్‌వైజర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఈ సర్వేలో ముఖ్యంగా పాలు, మాంసం ఉత్పత్తి ఎంత వరకు వస్తోందో తెలుస్తుంది. అలాగే పశువులకు అవసరమైన మందుల బడ్జెట్ అంచనా వేయవచ్చు. సర్వేకు వచ్చే సిబ్బందికి పశుపోషకులు, రైతులు సహకరించాలి.

–డాక్టర్ మారుతీసకారామ్, పశుసంవర్ధకశాఖ ఏడీఏ, బనగానపల్లె

మైనింగ్ యజమానుల సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కొలిమిగుండ్ల: మైనింగ్ యజమానుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ పరిశ్రమపై కన్సడరేషన్ ఫీజును భారీగా వసూలు చేసేందుకు సిద్ధం కావడంతో గత ఐదు రోజుల నుంచి నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం బందార్లపల్లె క్రాస్ రోడ్డులోని రాయల్టీ చెక్‌పోస్టు వద్ద గనులు, ట్రాక్టర్, పాలీష్ ఫ్యాక్టరీ యజమానులు నిరసన దీక్ష చేపట్టారు. మైనింగ్ యజమానుల సమస్యలను తెలుసుకునేందుకు సోమవారం మంత్రి బీసీ దీక్షా స్థలానికి వచ్చారు. మైనింగ్ అసోసియేషన్ నాయకులు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. యజమానులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన కన్సరేషడన్ ఫీజును నిజాయితీగా చెల్లించాలన్నారు.

బదిలీల్లో పారదర్శకత పాటించాలి

కోవెలకుంట్ల: వచ్చే ఏడాది వేసవి సెలవుల్లో నిర్వహించే ఉపాధ్యాయ బదిలీల్లో రెండు విద్యాసంవత్సరాలను ప్రామాణికంగా తీసుకోవాలని రాష్ట జాతీయ ఉపాధ్యాయ పరిషత్ కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ అన్నారు.సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతిసారి నిర్వహించే బదిలీల ప్రక్రియలో మే 31 కటాఫ్ తేదీగా పరిగణిస్తే 2023 సంవత్సరంలో పదోన్నతులు, బదిలీ లు పొందిన ఉపాధ్యాయులు, 2017వ సంవత్స రంలో బదిలీలు పొందినవారు నష్టపోయే అస్కా రం ఉందన్నారు. ఈ ఒక్క ఏడాది అకడమిక్ ఇయర్‌ను ప్రామాణికంగా తీసుకుని ఏటా మే 31 కటాఫ్ తేదీగా బదిలీ కోడ్ ఇవ్వాలని కోరారు.

నందవరంలో క్షుద్రపూజల కలకలం

- భయాందోళనలో గ్రామస్తులు

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలోని బిల్డింగ్ కాలనీలో సుమారు 20 రోజుల నుంచి క్షుద్ర పూజల కలకలంతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. ఈ కాలనీ గ్రామానికి చివర ఉంది. దీంతో గుర్తు తెలియని దుండుగులు రాత్రి 1 నుంచి 3 గంటల మధ్యలో కాలనీలోని ఇళ్ల ముందు పసుపు, కుంకుమ కొబ్బెర నిమ్మకాయలు ఉంచి వెళ్తున్నారు. ఈ ఘటనలు కాలనీవాసులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఎవరో క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. వీరిని పట్టుకునేందుకు కాలనీలో రాత్రి పూట యువకులు గస్తి తిరుగుతూ చెలిమంటలు వేసుకుని కాపలాకాస్తున్నారు. అయినా దుండగులు ఏ మార్చి మరో సందులోని ఇంటి ముందు పెట్టి వెళ్తున్నారు. ఈ విషయాన్ని కాలనీవాసులు కొందరు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆయన గ్రామాన్ని సందర్శించి భయందోళన చెందాల్సిన పనిలేదని, ఆకతాయిలు చేస్తున్న పని అని, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని కాలనీవాసులకు ధైర్యం చెప్పారు.

ఆలయ స్థలంలో అక్రమ నిర్మాణం


టీడీపీ నేతలు చేపట్టిన అక్రమ నిర్మాణం

ప్యాపిలి: మండల పరిధిలోని ఏనుగుమర్రి గ్రామంలో కూటమి నేతలు అక్రమ కట్టడానికి పూనుకున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు బత్తిన చిన్న మల్లయ్య, బత్తిన ఆదినారాయణ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ స్థలంలోనే ఏకంగా అక్రమ నిర్మాణం చేస్తున్నారు. ఈ నిర్మాణం చేపడితే దాదాపు పది కుటుంబాలకు దారి లేకుండా పోతుంది. స్థానికంగా ఉన్న ఓ టీడీపీ నాయకుడి అండదండలతోనే పంచర్ షాపు కోసం ఈ నిర్మాణం చేపడుతున్నారు. కాగా ఆలయ స్థలాన్ని ఆక్రమించడంతో పాటు అక్రమ నిర్మాణం చేపట్టడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం చేపడితే తమ ఇళ్లకు దారి ఎలా అని పలు కుటుంబాల వారు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణంపై ఫిర్యాదు అందడంతో తహసీల్దార్ భారతి ఆదేశాల మేరకు వీఆర్వో వంశీ అక్రమ నిర్మాణాన్ని పరిశీలించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

గణిత మేధావికి ఘన నివాళి


రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్: గణిత శాస్త్రం అన్ని శాస్త్రాలకు తల్లివంటిదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలితదేవి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాగణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గణితశాస్త్రం మానవ జీవితంలో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిస్తుందన్నారు. గణితం లేనిదే ప్రపంచ పురోగతి లేదన్నారు. గణిత శాస్త్ర అధ్యాపకులు బాబునాథ్ గణితశాస్త్రం ప్రాముఖ్యత, గణితం ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో బడే సాహెబ్, అధ్యాపకులు మహమ్మద్ గౌస్, రామకృష్ణ, నీతమ్మ, కౌసల్యదేవి, వరలక్ష్మీ, ఉమాశంకర్ పాల్గొన్నారు.

సేవతో మానవజన్మకు సార్థకత

బేతంచెర్ల: సమాజానికి సేవ చేయడంతోనే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని వైద్యులు సాగరిక, వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో రోగులు, గర్భిణులు, వృద్ధులకు అన్నదానం చేశారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కందగడ్డల జనార్దన్, సుప్రియ దంపతుల సహకారంతో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. క్లబ్ సభ్యులు విష్ణు మోహన్, మనోహర్‌రెడ్డి, హరి, వలిబాషా, కేశాలు నాయుడు, రాజు పాల్గొన్నారు.


రోగులకు అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

సారా స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్


సీజ్ చేసిన సారా, నిందితులను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

అవుకు: నాటుసారా తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని 100 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వర్ధనాదేవి తెలిపారు. సోమవారం అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లో దాడులు నిర్వహించామని చెప్పారు. అవుకు మండలం కొండమనాయునిపల్లెకు చెందిన కోనేటి విజయ్, మేడసారి గణేష్ సారాను మోటర్ సైకిల్‌పై తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి వద్ద నుంచి వంద లీటర్ల సారా, మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. గ్రామంలో సారా బట్టీలను ధ్వంసం చేసి 600 లీటర్ల బెల్లం ఊటను పారబోశామని తెలిపారు. అలాగే కొలిమిగుండ్ల మండలం చింతలాయపల్లె గ్రామానికి చెందిన ఆదిస్వామి సారా కొనుగోలు చేస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ కరుణాకర్ పాల్గొన్నారు.

శ్మశాన వాటిక దారి ఏర్పాటుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్


శ్మశాన వాటిక దారిని పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కొలిమిగుండ్ల: స్థానిక ప్రధాన రహదారిలోని బ్రిడ్జి కింద భాగంలో ఉన్న శ్మశాన వాటిక రహదారిని బాగు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. బ్రిడ్జి కింద భాగం నుంచి శ్మశానం వరకు మురుగునీరు, చెత్త చెదారం నిండిపోయి అస్తవ్యస్తంగా మారిపోయి ఉండేది. సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన చచ్చినా..చావే అనే శీర్షికతో వచ్చిన కథనానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పందించారు. తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి, ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, ఎస్‌ఆర్ఈజీఎస్, పంచాయతీ అధికారులతో కలిసి శ్మశాన వాటిక రహదారిని పరిశీలించారు. దారిలో చెత్తచెదారం, కంపచెట్లు తొలగించి శుభ్రం చేయాలని ఆదేశించారు. గ్రావెల్ రోడ్డు నిర్మించి శ్మశాన స్థలాన్ని బాగు చేయాలని సూచించారు. వాగు మధ్యలో నుంచి శ్మశానానికి చేరుకునేందుకు మధ్యలో పైపులు ఏర్పాటు చేసి సౌకర్యంగా ఉండేలా చేయాలన్నారు.

ముచ్చట్ల మల్లికార్జునస్వామికి పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో ఉన్న ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో మార్గశిర మాసం సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ, మహామంగళహారతి నిర్వహించారు.

ఫాతెహా సమర్పణ

బనగానపల్లె: స్థానిక పాతబస్టాండ్ వద్దనున్న హజరత్‌మీర్ హుస్సేన్‌వలి దేహలివాలే సాహెబ్ దర్గాలో జరిగిన ఉర్సు గంధోత్సవంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. సోమవారం ఫాతెహాలు సమర్పించి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఉపసర్పంచ్ బురానుద్దీన్ పాల్గొన్నారు.

తప్పకోవాలని రేషన్ డీలర్లపై ఒత్తిళ్లు

డోన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రేషన్‌షాపు డీలర్లు, సబ్ డీలర్లు, ఎస్‌ఆర్‌ఈజీఎస్, ఫీల్డ్ అసిస్టెంట్లు, పొదుపు ఏపీఓలను తొలగించి తమవారిని నియమించేందుకు ఆ పార్టీ నాయకులు పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలో డీలర్ల తొలగింపునకు రెవెన్యూ అధికారులతో తరచూ తనిఖీల పేరుతో వేధించడమే కాకుండా పోలీసుల సహాయంతో బెదిరింపులకు గురిచేస్తున్నారు. ముఖ్యంగా డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాలకు చెందిన పలువురు డీలర్లను పోలీసుస్టేషన్లకు పిలిపించి బెదిరిస్తున్నారు. సోమవారం పట్టణానికి చెందిన ధారా ప్రతాప్‌రెడ్డి అనే రేషన్ డీలర్‌ను స్టేషన్‌కు పిలిపించి ఓ పోలీసు అధికారి డీలర్‌షిప్ వదులుకోవాలని హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో ఆయన తాను వదులుకునే ప్రసక్తే లేదని, లీగల్‌గా తనపై చర్యలు తీసుకోవచ్చని తేల్చిచెప్పనట్లు సమాచారం.

వైభవంగా దధీ మథనం

డోన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు సోమవారం స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో దధీ మథనం కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాము శర్మ దధీ మథనం చేశారు. అంతకుముందు గోదాదేవి సమేతుడైన వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీబాయి, శ్రీనివాస్‌రావ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

డోన్ టౌన్: పట్టణానికి చెందిన వెంకటస్వామి, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు దత్త మునిస్వామి జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. ఈనెల 31వ తేదీ నుంచి జనవరి 2వ తేదీ వరకు కేరళలోని కొచ్చిన్‌లో జరిగే జాయతీ స్థాయి పోటీల్లో దత్త మునిస్వామి పాల్గొననున్నట్లు కోచ్ లక్ష్మన్ సోమవారం తెలిపారు. అతన్ని పలువురు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం


వెలుగు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్

బనగానపల్లె రూరల్: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు, పండ్లు ఆరోగ్యానికి ఎంతో మంచిదని యనకండ్ల గ్రామ ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ మున్నీ అన్నారు. మండల ఐక్యసంఘం ఆధ్వర్యంలో బనగానపల్లె డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయాల స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఎలాంటి రసాయనిక మందులు లేకుండా సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి గిట్టుబాటు ధర ఉంటుందని, వీటిని ఆహారంగా తీసుకోవడం వల్ల ఎలాంటి జబ్బులు రాకుండా ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. వీటిని ఆదరించి రైతులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఐక్యసంఘం అధ్యక్షురాలు ఫకూర్ బీ, ఐసీఆర్‌పీలు వనజ, లక్ష్మీ ఈశ్వరి, దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు


విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

డోన్: క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో నిర్వహిస్తున్న రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ వింటర్ కోచింగ్ ప్రాక్టీస్ మ్యాచ్‌ను తిలకించేందుకు వచ్చిన ప్రభుత్వ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దురదృష్టవశాత్తు అధికశాతం పిల్లలు చదువును పక్కనపెట్టి సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారన్నారు. చదువుతో పాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. క్రీడల్లో నైపుణ్యం సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలిగితే అత్యున్నతస్థాయి ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థినులు క్రీడల్లో రాణించేందుకు అన్ని రకాల క్రీడలకు సంబంధించిన గేమ్స్, స్పోర్ట్స్ పరికరాలను అందజేస్తానని డీఎస్పీ హామీ ఇచ్చారు. ఎంఈఓ ప్రభాకర్, హాస్టల్ వార్డెన్ మేరి కుమారి, జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు కేఈ మౌళా, రామ్మోహన్, డేవిడ్, ఇంతియాజ్, ప్రకాష్, కామేష్, రషీద్, రామ్‌కీ, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల పల్లకీ సేవ

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, నైవేద్య సమర్పణ చేసి కర్పూర నీరాజనాలు పలికారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఆలయ ఈఓ చంద్రుడు,పాతపాడు సర్పంచ్‌మహేశ్వరరెడ్డిపాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


గ్యాస్ ప్రమాదాలపై అవగాహన

డోన్ టౌన్: వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య, డోన్ అగ్నిమాపక అధికారి రంగస్వామిగౌడ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్(ఏటీ) విద్యార్థులకు ఆన్ ద జాబ్ ట్రెనింగ్‌లో భాగంగా సోమవారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో లీడింగ్ ఫైర్‌మెన్ ప్రభాకర్ అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలను ఏ.బీ.సీ.డీలుగా నాలుగు రకాలుగా గుర్తించాలన్నారు. ప్రమాదం సంభవించినప్పుడు కూలింగ్ సిస్టం, స్మాథరింగ్, బ్లాంకెటింగ్, స్టార్ వేసన్ అనే పద్ధతుల్లో మంటలను అదుపు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఇంటిలో గ్యాస్ సిలిండర్, ఫ్యాక్టరీలు, సినిమా థియేటర్లు, షాపింగ్ మాల్స్, వ్యవసాయ పంటల్లో మంటలు చెలరేగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అధ్యాపకుడు చంద్రమోహన్, ధనుంజయశెట్టి, వెంకటస్వామి, అగ్నిమాపక సిబ్బంది శ్రీరాములు, రంగస్వామి, రాజశేఖర్, గౌరీ పాల్గొన్నారు.

బేతంచెర్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని వినతి


గుంతకల్ డీఆర్‌ఎంకు వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

బేతంచెర్ల: పారిశ్రామిక కేంద్రమైన బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో కరోనాకు ముందు ఉన్న విధంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని స్థానికులు బుగ్గానిపల్లె రైల్వేస్టేషన్‌లో గుంతకల్ డీఆర్‌ఎం విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, గూని నాగరాజు, నాగమోహన్, శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపకపోవడంతో గుంటూరు, విజయవాడ, అమరావతి, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు, పరిశ్రమల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాలంటే 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న డోన్, 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న నంద్యాల స్టేషన్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. స్పందించిన డీఆర్‌ఎం సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. విషయాన్ని నంద్యాల ఎంపీ, డోన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.